క్లుప్తంగా

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్ (గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

ఘనంగా నారాయణస్వామి ఆరాధన



ప్రత్యేక అలంకరణలో అవధూత నారాయణస్వామి సమాధి

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో బుధవారం అవధూత నారాయణస్వామి 25వ ఆరాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం అవధూత నారాయణస్వామి సమాధిని ప్రత్యేక పూలతో అలంకరించారు. ఉదయం 6గంటల నుండి 9 గంటలవరకు నారాయణస్వామి సమాధి వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. మధ్యాహ్నం 12గంటల నుండి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం 3 నుండి రాత్రి 9గంటల వరకు వి.కొత్తపల్లె, నల్లపురెడ్డిపల్లె, బ్రాహ్మణపల్లె గ్రామాలకు చెందిన భజన బృందాల భజన కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి.

ముగ్గురాయి గనుల పరిశీలన



వేములలో ముగ్గురాయి మైనింగ్‌ను పరిశీలిస్తున్న అధికారుల బృందం

వేముల : వేముల మండలంలో జరుగుతున్న ముగ్గురాయి గనులను జిల్లా మైనింగ్ అధికారి సుబ్రహ్మణ్యం బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వేముల, కొత్తపల్లి, గొందిపల్లి గ్రామాల్లో ముగ్గురాయి తవ్వకాలు జరుగుతున్నాయని, వాటిని పూర్తి స్థాయిలో పరిశీలిస్తున్నామన్నారు. మొదటిరోజు ఐదు గనులను పరిశీలించామని, రెండవరోజు ఏడు మైనింగ్‌లను పరిశీలించామని తెలిపారు. ఈ మైనింగ్‌లను పరిశీలించిన తర్వాత నివేదికలు రూపొందిస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే అక్రమ తవ్వకాలు చేపట్టడంపై ఎమ్మెల్సీ ఫిర్యాదు చేయడంపై గనులను పూర్తి స్తాయిలో పరిశీలిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గనులశాఖ ఆర్ఐలు రామసుబ్రహ్మణ్యం, రాధ, టీఏ అమని, సూపర్‌వైజర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా భారీ వాహనం



రోడ్డు మధ్యలో ఆగిన లారీ


పులివెందుల రూరల్: పట్టణంలోరి నల్లపురెడ్డిపల్లెకు వెళ్లే రహదారిలో భారీ వాహనాలు ఉండటంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వాహనాలు రోడ్డులో మళ్లించు కోవడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. 30 టైర్ల భారీ లారీలు రోడ్డుకు అడ్డంగా ఆగి పోయింది. దీంతో అటు వైపు వెళ్తున్న వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి భారీ వాహనాలను రోడ్లపై ఉంచకుండా చర్యలు తీసుకోవాలని వాహనాదారులు కోరుతున్నారు.

కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తే పోరాటాలు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్ర, రాష్ట్ర కూటమి ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు అధికారంలోకి వస్తే కార్మిక సంక్షేమాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చిందని, నేడు ఆ హామీ మరిచిపోయి కార్మికులను అణగదొక్కే నిర్ణయాలు చేపడుతున్నాయని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఏఐటీయూసీ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలు, కరెంటు ఛార్జీలు తదితర భారాలు మోయలేక కార్మిక కుటుంబాలు అర్థాకలితో గడుపుతున్నాయని తెలిపారు. పరిశ్రమలలో కార్మికుల జీవితాలకు భద్రత కల్పించేలా సేఫ్టీ సౌకర్యాలు కల్పించాలన్నారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆగస్టు 5న కడప విద్యుత్ భవన్ ఎస్ ఇ కార్యాలయం వద్ద జరగబోయే ఆందోళన కార్యక్రమంలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

చంద్రన్న బీమాకు గ్రహణం

- పేరు మార్పుతో సరిపెట్టుకున్న కూటమి ప్రభుత్వం
- హామీ ఇచ్చి పైసా కూడా ఇవ్వని వైనం
- బాధితుల ఎదురుచూపు



పులివెందుల రూరల్ : కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చి 14 నెలలవుతున్నా చంద్రన్న బీమా పథకానికి సంబంధించిన వెబ్‌సైట్ ఇప్పటికీ ఓపెన్ కాలేదు. అధికారం కోసం ఎన్నికల ముందు అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి రాగానే హామీల అమలును విస్మరించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. గతంలో 2014లో కూడా చంద్రబాబు అలివి కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని తుంగలో తొక్కారు. 2024 ఎన్నికల ముందు కూడా ప్రజలకు అనేక హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చి 14 నెలలవుతున్నా హామీలను నేటికీ నెరవేర్చలేకపోతున్నారు. చంద్రన్న బీమా పథకం అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గతంలో వైఎస్సార్ బీమాకు కూటమి ప్రభుత్వ అధికారంలో వచ్చిన తర్వాత చంద్రన్న బీమాగా పేరు మార్చి సరిపెట్టుకున్నారు. కానీ ఇప్పటివరకు పథకానికి సంబంధించిన విధానాలు ప్రకటించలేదు. సహజ మరణానికి రూ.5లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే బాధిత కుటుంబాలకు రూ.10లక్షలు అందిస్తామని ఎన్నికల ముందు కూటమి నాయకులు ప్రజలకు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి 14 నెలలు పూర్తవుతున్నా బీమా పథకం అమలు గురించి పట్టించుకోవడం లేదు.

ఓపెన్‌కానీ వెబ్‌సైట్

2024 తర్వాత ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకాన్ని వెబ్‌సైట్‌లో నుంచి తొలగించింది. తర్వాత చంద్రన్న బీమాగా మార్చినా వెబ్‌సైట్‌లో ప్రారంభించలేదు. ఇప్పటివరకు పథకానికి సంబంధించిన మార్గదర్శకాలు కూడా ఇవ్వలేదు. బీమా దరఖాస్తులకు స్వీకరించేందుకు ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలు లేవని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. ఎంతోమంది కుటుంబ యజమానులను కోల్పోయిన బాధితులు బీమా కోసం ఎదురుచూస్తున్నారు.

వైఎస్సార్ బీమాతో ఆసరా

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 18ఏళ్ల నుంచి 58ఏళ్లలోపు, 50ఏళ్ల నుంచి 60ఏళ్లలోపు వారు మృతి చెందితే లక్ష రూపాయల నుంచి రూ.5లక్షల వరకు వైఎస్సార్ బీమా మంజూరయ్యేది. ఇంటి యజమాని మృతి చెందిన వెంటనే వాలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది మృతుడి ఇంటికి వెళ్లి అంత్యక్రియల కోసం తక్షణసాయంగా రూ.10వేలు ఇచ్చేవారు. మిగతా సొమ్ము నామిని పేరుతో బ్యాంక్ ఖాతాలో డబ్బు జమయ్యేది. ఈ బీమా సొమ్ము కోసం ప్రభుత్వం బీమా ప్రీమియం చెల్లించేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆ పథకాన్ని గాలికి వదిలేసింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చంద్రన్న బీమాను అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్షేమ హాస్టళ్లల్లో కనీస వసతులు కరువు



విద్యార్థులతో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు

వల్లూరు (చెన్నూరు) : జిల్లాలో సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు కనీస వసతులు కరువయ్యాయని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు ఆరోపించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్ల బాట కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా రెండవ రోజు కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం విద్యార్థి విభాగం అధ్యక్షుడు గుమ్మల సాయికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో చెన్నూరు మండలంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల సంక్షేమ హాస్టళ్లలో పరిస్థితులు పూర్తిగా క్షీణించి పోయాయన్నారు. కనీస వసతులులేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెన్నూరు మండలం వైస్సార్‌సీపీ సీనియర్ నాయకులు నిరంజన్ రెడ్డి,విద్యార్థి విభాగం చెన్నూరు నాయకులు పాల్గొన్నారు.

అవుట్‌సోర్సింగ్ విధానంలో డ్రైవర్ల నియామకం

జమ్మలమడుగు: ఏపీఎస్ ఆర్టీసీలో అవుట్ సోర్సింగ్ విధానంలో ఆన్‌కాల్ డ్రైవర్‌లుగా పనిచేసేందుకు నిరుద్యోగులు దరఖాస్తులు చేసుకోవాలని డిపో మేనేజర్ ప్రవీణ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టు నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అమలవుతుండటంతో ఈ నియామకాలు చేపడుతున్నట్లు తెలిపారు. అభ్యర్థులు హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు 18 నెలలు అనుభవం కలిగి ఉండాలని చెప్పారు. అభ్యర్థులు ఆధార్ కార్డు, ఆర్టీవో క్లీయరెన్సు సర్టిఫికెట్ ఉండాలన్నారు. ఎంపికైన వారికి శిక్షణతోపాటు మెడికల్ పూర్తి చేయించిన తర్వాత ఫిట్ పూర్తి చేసుకున్న వెంటనే డ్యూటీలోకి తీసుకుంటామని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవలని కోరారు.

కంట్రోల్ రూంలో పనిచేయని ఫోన్లు

ఆర్టీసీ డిపోలో ప్రయాణికులకు సమాచారం కోసం ఏర్పాటు చేసిన ఫోన్ పనిచేయడంలేదంటూ ప్రయాణికులు వాపోతున్నారు. గత నాలుగు నెలలుగా కంట్రోల్ రూంలో ఫోన్ పనిచేయడం లేదని అధికారులకు ఫిర్యాదులు చేసిన డి పోమేనేజరు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు.

తక్కువ ప్రీమియంతో అధిక ఇన్సూరెన్స్



మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్ ప్రవీణ్

జమ్మలమడుగు రూరల్: బ్యాంక్ ఖాతాదారులకు తక్కువ ప్రీమియంతో అధిక ఇన్సూరెన్స్ సౌకర్యం ఉందని కెనరా బ్యాంక్ మేనేజర్ ప్రవీణ్ అన్నారు. బుధవారం జమ్మలమడుగు మండలపరిధిలోని ధర్మాపురం గ్రామ సచివాలయంలో కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో జన సురక్ష, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ రూ. 456 రూపాయలతో రూ, 4 లక్షల వరకు ఇన్సూరెన్స్ సౌకర్యం ఖాతాదారులకు ఉందని ఆయన తెలిపారు. రూ. 20తో ప్రీమియంతో రెండు లక్షల వరకు అక్సిడెంట్ ఇన్సూరెన్స్ పొందవచ్చని పేర్కొన్నారు. అలాగే రూ. 436 రూపాయలతో రెండు లక్షల వరకు సహజ మరణంతో పాటు ప్రమాదంలో చనిపోతే ఇన్సూరెన్స్ సౌకర్యం ఉంటుందని తెలిపారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ వెంకటేశ్, సర్పంచ్ వెంకట రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రహదారులే మా అడ్డా



రోడ్డుపై సంచరిస్తున్న ఆవులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని ప్రధాన రహదారులపై పశువులు తిష్ట వేయడంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. ఆవులను యజమానులు వీధుల్లోకి తోలేస్తున్నారు. వీటి వల్ల తరుచూ ప్రమాదాల బారిన పడుతున్నామని ఆందోళన చెందుతున్నారు. పశువుల సంచారం కారణంగా ట్రాఫిక్ కష్టాలు ఎదురవుతున్నాయి. ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు పోలీస్ సిబ్బంది ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రయాణికులు మరిన్ని ఇబ్బందులు పడుతున్నారు. పశువుల వల్ల వాహనదారులు ఇబ్బందులు పడితే యజమానులపై చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నప్పటికీ ఇప్పటివరకూ ఎవరిపైనా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. పట్టణంలో పలు ప్రాంతాల్లో ఆవులు ప్రధాన రహదారిపై తిరగడం, పరిగెత్తడం, పడుకోవడం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తోందోనని ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి ఆవులను గోశాలకు తరలించాలని, లేకపోతే యజమానులను హెచ్చరించి వాటిని సంరక్షించేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఆస్పత్రి స్థలం హద్దుల ఏర్పాటుకు సర్వే

సిద్దవటం: మండలంలోని మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థలానికి హద్దులు ఏర్పాటుచేసేందుకు సర్వే నిర్వహిస్తున్నామని సర్వేయర్ సోమశేఖర్ తెలిపారు. విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ మాధవరం పీహెచ్‌సీ స్థలం అన్యాక్రాంతం అవుతోందని వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దారుకు ఫిర్యాదు చేశారని తెలిపారు. తహసీల్దారు తిరుమలబాబు ఆదేశాల మేరకు శాఖరాజుపల్లె రెవెన్యూ గ్రామంలోని సర్వే నెంబర్ 425/1, 425/2లో పీహెచ్‌సీకి కేటాయించిన స్థలంలో సర్వే చేసి మూడు రోజుల్లో నివేదికను పై అధికారులకు సమర్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ శివకుమార్, ఆసుపత్రి అభివృద్ధి సలహా మండలి సభ్యులు సామా శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి

మండల సమావేశంలో ప్రజాప్రతినిధుల ఆవేదన



మాట్లాడుతున్న ఎంపీపీ మాదవీ బాలకృష్ణ

చక్రాయపేట: చక్రాయపేట మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని మండల సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. బుధవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మాధవీ బాలకృష్ణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని, రైతులందరికీ యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తు తీర్మానం చేశారు. బీమా చెల్లించిన మామిడి రైతులకు ఇన్సూరెన్స్ ఇవ్వాలని జెడ్పీటీసీ సభ్యుడు శివప్రసాదరెడ్డి డిమాండ్ చేశారు. అలాగే పాడా కింద రైతులు పైపుల కోసం డబ్బులు కట్టారని వాటిని కూడా అందించాలని ఆయన సభ దృష్టికి తీసు కొచ్చారు. మూడు నెలలకు ఒక మారు జరిగే సమావేశంలో ప్రజా ప్రతినిధులు అడిగే సమస్యలపై సమాధానాలు ఇవ్వాల్సిన అధికారులు సమావేశానికి డుమ్మా కొట్టారు. హాజరుకాని అధికారులకు నోటీసులు ఇస్తామని ఎంపీడీవో కుళాయమ్మ చెప్పారు. తహసీల్దారు విజయకుమారి, వైస్ ఎంపీపీ గఫూర్, ఎంపీటీసీలు లీలావతి, శాంతమ్మ, మోహన్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు గౌస్‌లాదం, సర్పంచులు శ్రీధర్‌రెడ్డి, పులివెందుల ఏడీఏ ప్రభాకరరెడ్డి, ఉద్యానశాఖ అధికారి రాఘవేంద్రారెడ్డి, చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ వేగంగా పూర్తి చేయాలి

వేంపల్లె : వేంపల్లి మండలంలో స్వర్ణ పంచాయతీ డేటా ఎంట్రీని వేగంగా పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం వేంపల్లి పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో స్వర్ణ పంచాయతీ డేటా ఎంట్రీలో వేంపల్లి మండలం చాలా వెనుకబడి ఉందని తెలిపారు. పంచాయతీ సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లు సమష్టి కషితో డేటా ఎంట్రీని వేగవంతం చేసి త్వరలో పూర్తి చేయాలన్నారు. అలాగే వేంపల్లి గ్రామపంచాయతీలో డ్రైనేజీ, పారిశుద్ధ్య వ్యవస్థలు అధ్వానంగా ఉన్నాయని తమ దష్టికి వచ్చిందని తెలిపారు. ఇక్కడ ఉన్న ఈవో మాధవరెడ్డి సెలవుపై వెళ్లడంతో చాలా ఇబ్బందులు తలెత్తాయని, త్వరలో నూతన ఈవోను నియమిస్తామని చెప్పారు. తాగునీటికి ఎటువంటి సమస్యలు రాకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. డ్రైనేజీ పారిశుద్ధ్యంపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి సమస్యలు లేకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. పంచాయతీ సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ



భూపాల్‌రెడ్డికి వేంకటేశ్వరుడి చిత్రపటాన్ని బహూకరిస్తున్న పాఠశాల సిబ్బంది

వేంపల్లె : అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాలను నివారించవచ్చని అగ్నిమాపక రీజినల్ ఆఫీసర్ భూపాల్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక గండి రోడ్డులోని నారాయణ పాఠశాలను అగ్నిమాపక రీజినల్ ఆఫీసర్ భూపాల్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఇంట్లో వంట గ్యాస్ లీక్ అయి మంటలు వచ్చే సమయంలో సంచి పట్టాలను వాటిపై వేయాలని సూచించారు. అగ్ని మంటలు ఆర్పే సమయంలో కూడ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అగ్ని ప్రమాదాలు జరిగిన వెంటనే ఫైర్ అధికారులకు వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. అగ్ని ప్రమాదాలు ఎక్కువగా వేసవి కాలంలోనే జరుగుతాయని చెప్పారు. మంటలు ఎక్కువగా ఉన్న సమయంలో నడవకుండా ముఖానికి గుడ్డ కప్పుకొని పాకుతూ ఇంట్లో నుంచి బయటికి రావాలని సూచించారు. ప్రతి విద్యార్థి క్రమ శిక్షణతో విద్యను అభ్యసించి మంచి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం రీజనల్ ఆఫీసర్ భూపాల్ రెడ్డిని కరస్పాండెంట్ నారాయణ రెడ్డి సత్కరించి వేంకటేశ్వర స్వామి చిత్ర పటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయంలో టెండర్ల నిర్వహణ



టెండర్లు నిర్వహిస్తున్న అధికారులు

చింతకొమ్మదిన్నె : జిల్లాలో ప్రసిద్ధిచెందిన కొత్తపేట గంగమ్మ తల్లి భక్తులకు కోరిన కోరికలు తీరుస్తారని ప్రజల విశ్వాసం. బుధవారం గంగమ్మ దేవస్థానం అధికారులు ఆలయ పరిధిలో భక్తులు ఉపయోగించుకొనే వంట సామగ్రి, షామియాన, పూలదండలు, పూజ సామగ్రి, చెప్పుల స్టాండ్ ఏర్పాటుకు టెండర్లు నిర్వహించారు. ఈ టెండర్లలో కుర్చీలు, వంట సామన్లు, షామియానాలు అద్దెకు ఇచ్చుకునేందుకు రూ. 5,80,000 వెంకటసుబ్బయ్య, కూల్ డ్రింక్స్ షాపు నిర్వహణకు వెంకటరమణ రూ. 1,86,000లకు హక్కులు దక్కించుకున్నారు.పూజ సామగ్రి షాపు నిర్వహణకు రూ.1,22,000, చెప్పుల స్టాండు నిర్వహణకు రూ. 6,500లకు పాటదారులు దక్కించుకున్నారని, మొత్తం రూ. 8,94,000 టెండర్ల ద్వారా ఆదాయం వచ్చినట్లు ఈఓ కృష్ణానాయక్ తెలిపారు.

రేషన్‌కార్డు ఆధారంగా సంక్షేమ పథకాలివ్వాలి

వేంపల్లె: సంక్షేమ పథకాలకు రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకొని సంక్షేమ పథకాలు మంజూరు చేయాలని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు పీవీఎస్‌వీ ప్రసాదరావు, సూగురు రఘునాథరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుతం సంక్షేమ పథకాలకు సాధికారిక సర్వే ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక చేస్తున్నారని, దీంతో ఎంతోమంది అర్హులు అవకాశం కోల్పోతున్నారని చెప్పారు. సాధికార సర్వే నాటికి, ఇప్పటికి కుటుంబ పరిస్థితులు మారిపోయినట్లు చెప్పారు. పెన్షన్ తో పాటు ఇతర పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలన్నా అనర్హులుగా తిప్పి పంపుతున్నారని చెప్పారు.

అధికారుల తప్పు... వాహనాలకు తుప్పు





పట్టణంలోని ఏపీఎస్పీడీసీఎల్, పులివెందుల బ్రాంచ్ కెనాల్‌కు సంబంధించిన ప్రభుత్వ వాహనాలను ఆవరణలో వృథాగా వదిలేశారు. ఎండకు ఎండి.. వానకు తడిసి ఎందుకూ పనికి రాకుండా తుప్పుపట్టి పోతున్నాయి. లక్షలాది రూపాయల విలువ చేసే ఈ వాహనాల్లో కాకుండా కొందరు అధికారులు తమ సొంత వాహనాలలో కార్యాలయాలకు వస్తుండడంతో ఇవి పనికిరాకుండా పోయాయి. అధికారులు స్పందించి వాహనాలను వేలం వేయాలని సిబ్బంది చెబుతున్నారు.

– పులివెందుల రూరల్

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి



పులివెందుల రూరల్: మాట్లాడుతున్న వ్యవసాయాధికారి చెన్నారెడ్డి



కమలాపురం: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ సరస్వతి

వేముల: ఉల్లి సాగులో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ ఓబులేసు రైతులకు సూచించారు. మండలంలోని గొల్లల గూడూరు గ్రామంలో బుధవారం ఉల్లి పంటలపై పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉల్లి పంట సున్నితమైన పంట కావడంతో ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులు యాంత్రీకరణ ద్వారా పంటల సాగులో పెట్టు బడులు తగ్గి దిగుబడులు సాధించవచ్చున్నారు. మినుము పంటలో వచ్చే పల్లాకు , ఆకు పచ్చ తెగులు నివారణకు ఎక్సా కోనజోల్ లీటర్‌కు రెండు మిల్లీలీటర్లు నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. వేరుశనగలో కలుపు నివారణకు 16 రోజులు తర్వాత హిమాజీత్ టీపీర్ 10 శాతం, 250 మిల్లీ లీటర్లు 200 లీటర్లుకు కలిసి పిచికారి చేయాలన్నారు. ఏఈఓలు సురేష్, రైతులు పాల్గొన్నారు.

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండలం ఉప్పరపల్లి నరసారెడ్డిపల్లిలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్ కుమార్ ప్రకృతి వ్యవసాయ గురించి వివరించారు. గ్రామంలో వరి పండిస్తున్న రైతులు యూరియా, డీఏపీ అధికంగా వాడుతుండడంతో భూమిలో కర్బన శాతం తగ్గిపోతున్నదని, భూమిలో సూక్ష్మజీవులు అభివృద్ధి తగ్గిపోతున్నాయన్నారు. ఈ కారణంగా రసాయనాలు తగ్గించుకొని పీఎండీఎస్, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం వినియోగించాలని వివరించారు. మండల వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్: పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణతో అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ అధికారి చెన్నారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని అచ్చవెల్లి గ్రామ రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. పంట వేసిన 60 రోజుల నుంచి పంటలో కాయ తొలిచే పురుగు గులాబీ రంగు పురుగు పంటను ఆశించకముందే చర్యలు తీసుకోవాలన్నారు.

కమలాపురం: రైతులు పచ్చిరొట్ట విత్తనాలతో భూసారం పెంచుకోవాలని రైతులకు ఏఓ సరస్వతి సూచించారు. బుధవారం మండలంలోని గంగవరం, విభరాపురం గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. క్షేత్ర స్థాయిలో మినుము, వరి పంటలను పరిశీలించారు. పంటల సాగులో సాగు పద్ధతులు, సస్యరక్షణ చర్యలు, ఎరువుల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. చౌడు భూముల్లో పీఎండీఎస్ విత్తనాలు సాగు చేసి 40 రోజుల్లో పచ్చి రొట్ట మొక్కలను కాడ పలుచగా ఉన్నపుడు కలియ దున్నటం వలన చేనుకు అవసరమైన మూడవ వంతు ఎరువు అంది భూసారం పెరుగుతుందన్నారు. చౌడు తీవ్రత తగ్గుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

నమ్మించి మోసం చేయడమే బాబు నైజం

- కూటమి బూటకపు హామీలను ఇంటింటికీ చెప్పాలి
- నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి



చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి

వీరపునాయునిపల్లె: ఎన్నికల మేనిఫెస్టోను నమ్మి ఓటేసిన ప్రజలను ముఖ్యమంత్రి చంద్రబాబు మోసం చేశారని కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి విమర్శించారు. బుధవారం మండలంలోని గంగిరెడ్డిపల్లె గ్రామంలో మండల కన్వీనర్ రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వ మేనిఫెస్టోకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ మోసాలను ప్రతి గడపకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. విద్యుత్ ఛార్జీలను భారీగా పెంచారని, నిత్యావసర సరుకులు ఆకాశాన్నంటాయని వివరించారు. ఉద్యోగులను పూర్తిగా విస్మరించారని తెలిపారు. అధికారంలోకి వస్తే నాణ్యమైన, తక్కువ ధరలతో మద్యం అందిస్తామని చెప్పిన బాబు ప్రైవేట్ షాపుల ద్వారా మద్యం అమ్మకాలను విచ్చలవిడి చేశారని మండిపడ్డారు. ఈ విషయాలన్నీ ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనపై ఉందని పేర్కొన్నారు.

రాష్ట్రంలో వాక్ స్వాతంత్ర్యం లేదు

ప్రజా సమస్యలపై మాట్లాడితే కేసులు నమోదు చేస్తున్నారని నరేన్ రామాంజులరెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలో వాక్ స్వాతంత్ర్యం లేదన్నారు. చంద్రబాబు పాలన చూస్తుంటే నాటి ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ రోజులు గుర్తొస్తున్నాయని చెప్పారు.

చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య

చింతకొమ్మదిన్నె : ఎన్నికల సమయంలో ఆచరణకు సాధ్యం కానీ హామీలిచ్చి అధికారంలోకి వచ్చి వాటిని అమలు చేయకుండా మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని వైఎస్సార్‌సీపీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి మండిపడ్డారు. చింతకొమ్మదిన్నె మండల పరిధి నుంచి కడప నగరం 45వ డివిజన్‌లోకి విలీనమైన ఊటుకూరులో బుధవారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథరెడ్డి పర్యవేక్షణలో చంద్రబాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా నరేన్ రామాంజనేయరెడ్డి గ్రామంలో ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలల్లో 99 శాతం అమలు చేశారన్నారు. 50 ఏళ్లకు దాటిన వారికి పింఛన్, నిరుద్యోగ భృతి, అన్నదాత సుఖీభవ రూ.20వేలు ఇస్తామని చెప్పి బాబు మోసం చేశారని విమర్శించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటికే సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందాయన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరగాల్సిన దుస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.

హామీల అమలులో విఫలం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని నరేన్ రామాంజులరెడ్డి విమర్శించారు. తల్లికి వందనం, ఉచిత గ్యాస్ పథకాలను సక్రమంగా అమలు కాక లబ్ధిదారులు కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారన్నారు. అన్నదాత సుఖీభవం ఎప్పుడిస్తారా అని రైతులు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ఎరువుల కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ప్రభాకర్ రెడ్డి, నిత్యానందరెడ్డి, చంద్రహాసరెడ్డి, శివరామిరెడ్డి, లింగారెడ్డి, రామచంద్రారెడ్డి, కష్ణారెడ్డి, శివ,రాజా, ప్రకాశం, వెంకటేశ్వరరెడ్డి, సిద్ధారెడ్డి, ఆంజనేయులు, సుబ్బారెడ్డి, సుధాకర్‌రెడ్డి, సురేంద్రారెడ్డి, కళాయాదవ్, వెంకటరెడ్డి, మల్లికార్జున యాదవ్, రాజశేఖర్ రెడ్డి, నాగరాజు, గంగాధర్ పాల్గొన్నారు.